
andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.2 । కనిష్ఠం 19.7
కామారెడ్డి
జిల్లా వార్తలు
5
గురువారం 12 సెప్టెంబరు 2024



మెస్ మేనేజర్ గెస్ట్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 11: కామారెడ్డిలోని సరంపల్లి ఎక్స్‌రోడ్డు దగ్గర గల తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పురుషుల డిగ్రీ కళాశాలలో గెస్ట్ పద్ధతిన మెస్ మేనేజర్‌గా పని చేయుటకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని రీజినల్ కో ఆర్డినేటర్ గంగారాం నాయక్ అన్నారు. ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఎంఎస్‌సీ(ఫుడ్ అండ్ న్యూట్రిషన్ కోర్సు లేదా తత్సమానకోర్సు) పూర్తిచేసిన ఔత్సాహికులు సంబంధిత కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. పూర్తి మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు.



పెద్దకొడప్‌గల్‌లో ఎండిపోయిన పత్తి పంట



పెద్ద కొడప్‌గల్‌లో ధర్నా చేస్తున్న రైతులు



భారీ వర్షాలకు నేల కొరిగిన మొక్కజొన్న పంట

పత్తి రైతు పరేషాన్

- జిల్లాలో అధిక వానలతో పంటకు తీవ్ర నష్టం
- ఎండిపోతున్న పత్తి పంట
- కొన్నిచోట్ల రాలుతున్న పూత, కాత
- పెద్దకొడప్‌గల్, జుక్కల్, మద్నూర్ తదితర ప్రాంతాల్లో పంటకు నష్టం
- సుమారు 300ల ఎకరాలకు పైగా ఎండిపోయిన పత్తి
- ఆందోళన చెందుతున్నరైతులు
- భారీ వర్షాలకు జిల్లా వ్యాప్తంగా 560 ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం
- 450 ఎకరాల్లో వరదలకు కొట్టుకుపోయిన వరి

కామారెడ్డి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులను పత్తి పంట పరేషాన్ చేస్తోంది. ఇటీవల కురిసిన అధిక వర్షాలకు పత్తి పంటకు నష్టం వాటిల్లుతోంది. పంట దెబ్బతినడంతో దిగుబడులపై ప్రభావం చూపనుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పత్తి పంట బాగుండాలని ఆనందపడుతున్న సమయంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పత్తి రైతుల పరిస్థితి తారుమారైంది. అధిక వానలకు పంటలో తేమ శాతం అధికమై మొక్కలు ఎండిపోతుండగా మరికొన్నిచోట్ల పూత, పిందెలు రాలుతున్నాయని రైతులు వాపోతున్నారు. ఉన్నవి మురిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరికొన్నిచోట్ల భారీ వర్షాలకు పత్తి నీట మునగడం, వరద తాకిడికి కొట్టుకుపోవడంతో తీవ్రంగా నష్టం వాటిల్లింది. పత్తి పంటకు నష్టపరిహారం ఇవ్వాలంటూ రైతులు ఆందోళన చేస్తున్నారు. పత్తి పంటకే కాకుండా జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలకు 560 ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ సర్వేలో తేలింది. ఇందులో 450 ఎకరాల్లో వరి పంట వరదల తాకిడికి కొట్టుకుపోయిందని క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు గుర్తించారు.

ఎండిపోతున్న పత్తి పంట

జిల్లాలో మద్నూర్, పెద్దకొడప్‌గల్, పిట్లం, జుక్కల్, బిచ్కుంద, సదాశివనగర్, గాంధారి, తాడ్వాయి, రాజంపేట,రామారెడ్డి తదితర ప్రాంతాల్లో పత్తి పంటను రైతులు వేల ఎకరాల్లోనే సాగు చేస్తుంటారు. ఈ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 33,395 ఎకరాల్లో పత్తి పంటను రైతులు సాగు చేశారు. ఒక్కో ఎకరాన ఇప్పటి వరకు దాదాపు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడులు పెట్టి పంటను వేశారు. పంటలు బాగున్నాయని ఆనంద పడుతున్న సమయంలో భారీ వర్షాలు రావడంతో కొన్నిచోట్ల పత్తి పంట మునిగిపోయింది. మరికొన్ని చోట్ల వరదల తాకిడికి కొట్టుకుపోయింది. అధిక వర్షాలు పడడంతో నల్లరేగడి భూముల్లో తేమ శాతం పెరిగి పంట కాస్త ఎండిపోతోంది. పెద్ద కొడప్‌గల్, జుక్కల్, మద్నూర్, బిచ్కుంద మండలాల పరిధిలో గతంలో ఎన్నడూ లేనివిధంగా పత్తిపంట ఎండిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధిక వర్షాల వల్లనే పంటకు ఈ పరిస్థితి ఎదురవుతుందని రైతులు చెబుతున్నారు. ఈ ప్రాంతాల్లో సుమారు 300ల ఎకరాలకు పైగా పత్తిపంట ఎండిపోయిందని దీంతో తీవ్రంగా నష్టపోయామంటూ రైతులు తలలు పట్టుకుంటున్నారు. ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలంటూ బుధవారం పెద్ద కొడప్‌గల్‌లో రైతులు రాస్తారోకో నిర్వహించి ఆందోళనకు దిగారు.

560 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లా వ్యాప్తంగా 560 ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ క్షేత్రస్థాయిలో నిర్వహించిన సర్వేలో తేలింది. 390 మంది రైతులు నష్టపోయినట్లు ఆ శాఖ అధికారులు గుర్తించారు. కామారెడ్డి, భిక్కనూర్, తాడ్వాయి, రామారెడ్డి, గాంధారి, సదాశివనగర్, రాజంపేట, బీబీపేట, దోమకొండ మండలాల్లో పంటలు వరదల తాకిడికి కొట్టుకుపోగా మరికొన్నిచోట్ల వర్షపు నీటిలో మునిగిపోయాయి. వరి పంటకు ఎక్కువగా నష్టం వాటిల్లింది. 450 ఎకరాల్లో వరి వరదల తాకిడికి నష్టం ఏర్పడింది. పత్తి 15 ఎకరాల్లో, మొక్కజొన్న 10, సోయాబీన్ 10, కూరగాయల పంటలు 15 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. భిక్కనూరు మండలంలో 221ఎకరాల్లో వరికి నష్టం వాటిల్లగా 115 మంది రైతులు నష్టపోయారు. తాడ్వాయిలో 110 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లగా 85మంది రైతులు, కామారెడ్డిలో 65 ఎకరాల్లో పంటలు దెబ్బతినగా 61 మంది రైతులు నష్టపోయారు.

జిల్లాలో 5.47 లక్షల ఎకరాల్లో పంటల సాగు

ఈ వర్షాకాలం సీజన్‌లో



భారీ వర్షాలకు నేల కొరిగిన వరి పంట

జిల్లా వ్యాప్తంగా 5,47,854 ఎకరాల్లో వివిధ పంటలు సాగైనట్లు వ్యవసాయశాఖ నిర్వహించిన సర్వేలో తేలింది. వ్యవసాయశాఖ అంచనా ప్రకారం కాస్త పంటల సాగు తగ్గింది. ఇందులో రైతులు వరిని ఎక్కువగా సాగు చేశారు. 3.11 లక్షల ఎకరాల్లో వరి సాగవగా సోయాబీన్ 92,135 ఎకరాలు, మొక్కజొన్న 44,601 ఎకరాలు, కందులు 55,218 ఎకరాలు, పత్తి 33,395 ఎకరాలు, మినుములు 4,812 ఎకరాలు, పెసర్లు 4,596 ఎకరాలు, చెరుకు 673 ఎకరాలు, జొన్నలు 39 ఎకరాల్లో సాగయ్యాయి.

భారీ వర్షాలకు పత్తి ఎండిపోయింది

• రాంచందర్, కాటేపల్లి, పెద్దకొడప్‌గల్ మండలం



కాటేపల్లి శివారులో 5 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశాను. ఇందులో భారీ వర్షాలకు 2 ఎకరాల్లో పంట దెబ్బతింది. పంట సాగు చేసే సమయంలో రూ.70వేల వరకు రసాయనాలకు ఇతర ఎరువులకు ఖర్చు చేశాను. పంట బాగా ఏపుగా పెరిగిన దశలో భారీ వర్షాలకు పత్తి నిలువుకు ఎండిపోయింది. అప్పుచేసి పంట సాగు చేస్తే నష్టంతో బాకీ తీరేలా లేదు.

శాస్త్రవేత్తల చేత పంటలను పరిశీలిస్తాం..

• తిర్మల్‌ప్రసాద్, డీఏవో, కామారెడ్డి



పెద్దకొడప్‌గల్ మండల పరిధిలో పత్తి పంట ఎండిపోతుందని రైతులు మా దృష్టికి తీసుకువచ్చారు. అక్కడ భారీ వర్షాలు కురిసి పత్తిపంట నీట మునిగిన పరిస్థితులు లేవు. కానీ పంట ఎందుకు ఎండుతుందో క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తాం. వ్యవసాయ శాస్త్రవేత్తలను పిలిపించి ఎండిపోయిన పంటలను పరిశీలింపజేస్తాం. అధిక వర్షాల వల్ల పంటలకు నష్టం వాటిల్లితే ప్రభుత్వానికి నివేదిస్తాం. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లా వ్యాప్తంగా 560 ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో వరి 450 ఎకరాలు, పత్తి 15, మొక్కజొన్న 10, సోయాబీన్ 10 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది.

పత్తి ఎండిపోవడం ఇదే మొదటిసారి

• మేగ రాజు, కాటేపల్లి తండా, పెద్దకొడప్‌గల్



ఈ వర్షకాలం సీజన్‌లో 10 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశాను. వర్షాల కంటే ముందు బాగానే ఉంది. భారీ వర్షాలు పడిన తర్వాత పంట ఎండిపోవడం మొదలైంది. ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈసారి పత్తి పంటను సాగు చేస్తే ఎండిపోవడం ఇదే మొదటిసారి. ఎండిపోవడంతో ఏం చేయాలో తోచడం లేదు. కండ్ల ముందే లక్షల రూపాయల పంట ఎండిపోవడంతో బాధగా ఉంది. ప్రభుత్వం ఆదుకోవాలి.

మరమ్మతుల కోసం ప్రతిపాదనలు సమర్పించాలి

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 11: జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల దెబ్బతిన్న రోడ్లు, కాల్వలు, భవనాలు, చెరువులు, కుంటలు, తాగునీటి వసతుల తాత్కాలిక మరమ్మతులకు అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కురిసిన వర్షాల వల్ల వివిధ రహదారులు, కాల్వలు, కల్వర్టులు, తరగతి గదులు, తదితర దెబ్బతిన్న రోజువారి కార్యకలాపాలకు అంతరాయం కలుగుతున్న వాటికి తాత్కాలిక మరమ్మతులకు అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు స్టేట్ డిజాస్టర్ రిలీఫ్ ఫండ్ ఉత్తర్వులకు లోబడి ప్రతిపాదనలు సిద్ధం చేసి వెంటనే సమర్పించాలని తెలిపారు. మున్సిపల్, పంచాయతీ, రోడ్డు భవనాల శాఖలకు చెందిన రోడ్లు, కాల్వలు, కల్వర్టులు దెబ్బతిన్నాయని వాటి తాత్కాలిక మరమ్మతులకు ప్రతిపాదనలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్‌లు సుజాత, శ్రీహరి, డీఈవో రాజు, ఆర్‌అండ్‌బీ ఈఈ రవిశంకర్, పంచాయతీ రాజ్ ఈఈ బావన్న, నీటి పారుదలశాఖ ఈఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోగా బియ్యం సరఫరా చేయాలి

జిల్లాలోని రైస్‌మిల్లుల యజమానులు ఈనెల 30లోగా బియ్యం సరఫరా చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. బుధవారం పౌర సరఫరాల అధికారులతో బియ్యం సరఫరా ఖరీఫ్‌కు సంబంధించి రైస్‌మిల్లు యజమానులు పెట్టవలసిన ధాన్యం సరఫరా వేగవంతంపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తమ పరిధిలోని రైస్‌మిల్లులు తనిఖీ చేసి బియ్యం ఎఫ్‌సీఐ/పౌరసరఫరాల శాఖకు సరఫరా చేయాలని ఆదేశించారు.

ఓటరు జాబితాకు పార్టీల ప్రతినిధులు సహకరించాలి

ఓటరు జాబితా పక్కాగా రూపొందించేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటి సర్వేకు తోడ్పాటును అందించాలని తెలిపారు. రాజకీయ పార్టీలు బూత్ లెవల్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జుక్కల్ నియోజకవర్గంలో 78, ఎల్లారెడ్డిలో 74, కామారెడ్డిలో 49 శాతం ఇంటింటి సర్వే పూర్తయిందని పేర్కొన్నారు.

గణేష్ నిమజ్జన శోభాయాత్ర మార్గం పరిశీలన

జిల్లా కేంద్రంలో గణేష్ నిమజ్జన శోభాయాత్రకు వెళ్లే మార్గాలను బుధవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ సింధూశర్మ పరిశీలించారు. స్టేషన్‌రోడ్డు, గంజిరోడ్డు, పెద్దబజార్, నిజాంసాగర్ చౌరస్తా మీదుగా కొత్త బస్టాండ్ నుంచి ఇందిరాగాంధీ స్టేడియం వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న విద్యుత్ తీగలు శోభాయాత్రకు ఆటంకం కలుగకుండా వేలాడుతున్న వైర్లను సరి చేయాలని విద్యుత్, మున్సిపల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్ద చెరువు వరకు శోభాయాత్ర మార్గాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, మున్సిపల్ కమిషనర్ సుజాత, డీఎస్పీ నాగేశ్వర్, ఆర్టీసీ డీఎం ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరిస్తాం : సబ్ కలెక్టర్

మద్నూర్, సెప్టెంబరు 11: ధరణిలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరిస్తామని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. డోంగ్లి మండలంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ధరణిలో ఉన్న పలు భూ సమస్యలను క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించారు. ధరణిలో తాము భూ సమస్యలు ఉన్నట్లు దరఖాస్తు చేసుకున్నా పరిష్కారం కాకపోవడంతో రైతులు గత కొన్ని రోజులుగా ఆందోళన చెందుతున్నారు. బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి డోంగ్లి మండలంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన సందర్భంగా ధరణిలో ఉన్న భూ సమస్యలను గుర్తించి క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యలను చూశారు. వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. ఆమెతో పాటు డోంగ్లి తహసీల్దార్ రేణుకా చౌహాన్, రెవెన్యూ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.



డోంగ్లిలో భూ సమస్యలను సబ్ కలెక్టర్ పరిశీలిస్తున్న దృశ్యం

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

మండలంలోని పెద్ద ఎక్లారా బాలికల సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలను బుధవారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పాఠశాలలో శానిటేషన్ సరిగ్గా లేదని మరోసారి వచ్చినప్పుడు ఇలా ఉన్నట్లయితే చర్యలు తప్పవని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థుల కోసం వండి వంటకాలను విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనం నాణ్యతగా పెట్టాలని, అదే విధంగా క్యాంపస్ పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శానిటేషన్ సరిగ్గా లేదని, మరోసారి తనిఖీ వచ్చినప్పుడు శానిటేషన్ సక్రమంగా చేయించాలని అన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడం వల్లనే విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. భోజనం, వసతి సౌకర్యాలు ఎలా ఉన్నాయని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. టీచర్‌ల బోధనపై విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. సబ్ కలెక్టర్ వెంట మండల తహసీల్దార్ ఎం.డి.ముజీబ్, ఎంపీడీవో రాణి, గిర్దావర్ శంకర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

నిండుగా నిజాంసాగర్ ప్రాజెక్టు

- ప్రాజెక్టులోకి నిలిచిన వరద నీరు
- నిలకడగా నిజాంసాగర్ నీటి నిల్వలు
- వానాకాలం, యాసంగి పంటల సాగుకు ఢోకా లేదు
- ఉభయ జిల్లాల రైతుల ముఖాల్లో చిరునవ్వు


నిజాంసాగర్, సెప్టెంబరు 11: మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలకు నిజాంసాగర్ ప్రాజెక్టు నిండుకుండలా మారింది. వర్షాకాలం ప్రారంభమై మూడు నెలలు గడిచినా వర్షాలు కురియలేదని మొదట్లో రైతులు ఆందోళన చెందారు. సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి భారీగా వర్షాలు కురియడంతో ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరద నీరు దాదాపు 24.366 టీఎంసీల నీరు వచ్చి చేరగా, ప్రాజెక్టు సామర్థ్యాన్ని 1405 అడుగులకు నిల్వ చేశారు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన 11.221 టీఎంసీల నీటిని దిగువకు వదిలేశారు. బుధవారం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు నిలిచిపోవడంతో వరద గేట్లను మూసివేశారు. నిజాంసాగర్ ప్రాజెక్టు నిలకడగా ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జూన్, జూలై, ఆగస్టు మాసాల్లో కేవలం నిజాంసాగర్ ప్రాజెక్టులో 1405 అడుగులకు గాను 1391 అడుగుల నీటి సామర్థ్యం కలిగి ఉండగా నిజాంసాగర్ ఆయకట్టుకు జూన్, జూలై నెలలో మొదటి విడత 1.217 టీఎంసీలను రెండో విడత 0.66.23 టీఎంసీలను ప్రధాన కాలువ ద్వారా విడుదల చేశారు. సెప్టెంబరు 4వ తేదీ నాటికి ప్రాజెక్టు వరద నీటితో నిండిపోయింది. 4వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఏడు రోజుల పాటు వరద గేట్లను ఎత్తి 11.221 టీఎంసీల నీటిని దిగువకు వదిలేశారు. ఈ ఏడాది వానాకాలంలో సెప్టెంబరు మొదటి వారంలో కురిసిన వర్షాలకి నిండిపోవడం వల్ల ఉభయ జిల్లాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మూసి ఉంచిన వరద గేట్లు



నిజాంసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుత నీటి మట్టం



కాంగ్రెస్‌లో పలువురి చేరిక

జక్రాన్‌పల్లి, సెప్టెంబర్11: నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి సమక్షంలో మండలంలోని తొర్లికొండ గ్రామ బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఆర్.శేఖర్‌గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం శేఖర్‌గౌడ్, జీవన్‌గౌడ్‌లకు ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, బ్రహ్మణ్‌పల్లి సింగిల్‌విండో చైర్మన్ కాట్‌పల్లి నర్సారెడ్డి, కాంగ్రెస్ నాయకులు గడ్డం గంగారెడ్డి, కట్కురవి, తాజుద్దీన్, వినోద్, రాజేష్‌గౌడ్, కాట్‌పల్లి సాయిరెడ్డి, రాజేశ్వర్, మల్లేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

గణేష్ మండపాల వద్ద అన్నదానం

బోధన్‌రూరల్, సెప్టెంబర్ 11: బోధన్ పట్టణంతో పాటు సాలూర, బోధన్ మండలాల్లో, పట్టణంలోని పలు వార్డులలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వినాయకుడిని మండపాల కూర్చోబెట్టి ఐదురోజులు కావస్తున్న సందర్భంగా అన్నదానాలు ప్రారంభమయ్యాయి. పట్టణంలోని హనుమాన్ టెకిడి, ఎల్‌బీఎస్ నగర్‌లో గల బాల గణేష్‌మండలి వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కూర శ్రీనివాస్, నర్సన్న, ధర్మ, బాల గణేష్ మండలి బాధ్యులు నీతేష్, సాత్విక్, సుమిత్, సకేత్, నెహాన్ రాజ్, వర్ధన్, చరణ్, సారధి, సాయి, రోహిత్, కరణ్, అమిత్, ధనుష్, తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి నాలుగు పాయింట్ల ఏర్పాటు

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబర్11: మున్సిపల్ పరిధిలోని గణేష్ నిమజ్జనానికి నాలుగు పాయింట్‌లను ఏర్పాటు చేసినట్టు ఆర్డీవో రాజాగౌడ్ తెలిపారు. 17న గణేష్ నిమజ్జనోత్సవం ఉండడంతో బుధవారం పట్టణంలోని గూండ్ల చెరువు, పెర్కిట్ చెరువు, కొటార్మూర్ పెద్ద చెరువు, మామిడిపల్లి చెరువుల్లో గణపతి నిమజ్జనం చేసేందుకు పాయింట్‌లను ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు.

భీమ్‌గల్‌లో మహాలడ్డు ఊరేగింపు


భీమ్‌గల్, సెప్టెంబరు 11: పట్టణ కేంద్రంలోని ఎర్రోడి గల్లీ గణేష్ మండలి ఆధ్వర్యంలో బుధవారం గణపతి మహాలడ్డును ఊరేగింపు నిర్వహించారు. యూత్ సభ్యులు వంశీకృష్ణ, నర్సయ్య, రాజు, రామ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


మహిళా సాధికారతకు కృషి


● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్‌రూరల్, సెప్టెంబర్ 11: బోధన్ నియోజకవర్గంలోని మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా మహిళ సాధికారితకు కృషి చేస్తున్నట్లు బోధన ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం బోధన్ మండలంలోని పెంటాఖుర్దు గ్రామ స్వయం సంఘాలకు ఎల్ఈడీటీ కింద అలీప్ సంస్థ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించింది. కార్యక్రమంలో భాగంగా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మహిళలతో కలిసి అలీప్ సందర్శించి ఫుడ్ ప్రాసెసింగ్‌కు సంబంధించి వివరాలు, నిర్వహణ వంటి విషయాలు సంస్థ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. మూడు దశాబ్దాలుగా ఎంతోమంది మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు వ్యాపార వేత్తలను ప్రోత్సహించి వారిని ఉన్నతస్థాయిలో నిలబెట్టిన ఘనత అలీప్‌దేనని, దానికి బాధ్యులైన రమాదేవిని ప్రశంసించారు. అలాగే కార్‌నోప్లెక్స్ పరిశ్రమను అభివృద్ధి చేయుటకు బోధన్ నియోజకవర్గం అనువైనదని అలీప్‌కు కావాల్సిన స్థలం ఇతర సదుపాయలు సమకూర్చినట్లయితే పరిశ్రమను నెలకొల్పి స్వయం సహాయక సంఘాల ద్వారా ఎంతోమంది మహిళలకు ఉపాధి కల్పించవచ్చని రమాదేవి సూచించారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్ని రకాలుగా ప్రోత్సహిస్తామని భరోసా కల్పించారు. అలీప్ ఆవరణలోని బయోడిగ్రేడబుల్ ఉత్పత్తులు జీరో వెస్ట్ మేనేజ్‌మెంట్ సాక్స్, క్లస్టర్, చిరుధాన్యాలు, తృణధాన్య ఉత్పత్తులను పరిశీలించారు.















పడిగెల పీఏసీఎస్ అక్రమాలపై విచారణ



ప్రత్యేక అధికారి మురళికి ఫిర్యాదు చేస్తున్న రైతులు

వేల్పూర్, సెప్టెంబరు 11 : మండలంలోని పడిగెల పీఏసీఎస్‌లో రైతుల పేరుతో అక్రమంగా రుణాలు తీసుకున్న ఘటనపై సహకార శాఖ ప్రత్యేక అధికారి మురళి గురువారం విచారణ చేశారు. పడిగెల పీఏసీఎస్‌లో గతంలో పనిచేసిన సిబ్బంది రైతులకు తెలియకుండానే వారి పేర్లపై రుణాలు తీసుకున్నారని, రైతులు చేసిన ఫిర్యాదు మేరకు గురువారం మురళి వచ్చి విచారణ చేశారు. నివేదికన జిల్లా సహకార శాఖ అధికారికి నివేదిస్తానని మురళి చెప్పారు.

బషీరాబాద్ ఉన్నత పాఠశాలకు కుర్చీల వితరణ

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 11: మండలంలోని బషీరాబాద్ ఉన్నతపాఠశాలలో పనిచేస్తూ ఇటీవలే బదిలీ పైవెళ్లిన ఇద్దరు ఉపాధ్యాయులు తమవంతుగా పాఠశాలకు 10 కుర్చీలను వితరణ చేశారు. పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన స్కూల్‌అసిస్టెంట్ తెలుగు తూర్పాటి ఆనంద్, ఎస్‌ఏ హిందీ మమత తమవంతుగా పాఠశాలకు కుర్చీలతో పాటు పాఠశాల అభివృద్ధి నిమిత్తం తమవంతుగా రూ.5 వేల నగదును పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగాధర్‌కు అందజేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

రెంజల్,సెప్టెంబర్ 11: మండలంలోని సాటాపూర్ గ్రామానికి చెందిన సాలూరు సాయిలుకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 58వేల మంజూరైన చెక్కును బుధవారం ఓబీసీ మండల అధ్యక్షుడు నితిన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడగా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేశారన్నారు. ఎమ్మెల్యేకు రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ సాయిలు, వడ్ల శంకర్, ప్రేమ్‌కుమార్, సాయిలు, గంగాధర్, గంగారాం, రాజు, భూమేష్, అనిల్, గోవింద్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ జట్టుకు మోర్తాడ్‌లో శిక్షణ

మోర్తాడ్, సెప్టెంబరు 11: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి జిల్లా సబ్‌జూనియర్ బాలికల బాల్‌బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఎస్సై బి.విక్రం శిక్షణను ప్రారంభించారు. ఈనెల 14నుంచి 15వ తేదీ వరకు సికింద్రాబాద్‌లోని రమ్యా గ్రౌండ్స్ కూకట్‌పల్లిలో 43వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయని కోచ్‌శ్యామ్ తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన జట్టుకు శిక్షణ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్య క్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ ముఖ్యఅతిథిగా ఎస్సై విక్రం పాల్గొన్నారు. జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామ్, ఉపాధ్యాయులు రవీందర్, రవి, వినయ్, సాగర్, రాము, దీపిక, పద్మ, భూలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన కలెక్టర్

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు 11: ఇటీవల ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందిన ఆలూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేందర్‌ను బుధవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసినప్పుడే ఉపాధ్యాయులకు గుర్తింపు లభిస్తుందన్నారు. అవార్డులు బాధ్యతలను మరింత పెంచుతాయన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సహాయం

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు 11: ఇటీవల రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన వరద బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వానికి తమవంతు సహాయంగా ఆర్మూర్ జర్నలిస్టు కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు బుధవారం రూ.11వేల డీడీ చెక్కును ఆర్డీవో రాజాగౌడ్‌కు అందజేశారు. భారీవర్షాలతో నష్టపోయిన వారికి అండగా నిలిచేందుకు తమవంతుగా ఆర్థికసహాయం అందజేస్తున్నామని కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కొక్కెర భూమన్న తెలిపారు. కార్యక్రమంలో సత్యనారాయణగౌడ్, కొంతం రాజు ఉన్నారు.

ముప్కాల్ : ఇటీవల కురిసిన భారీవర్షాల కారణంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో నష్టపోయిన బాధితులకు ఆపన్నహస్తంగా సీఎం సహాయనిధికి బుధవారం ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన రేసింగ్‌బాయ్ యూత్ అసోసియేషన్ ద్వారా రూ.10వేల ఆర్థిక సహాయాన్ని పంపారు. తెలంగాణ రాష్ట్రానికి రూ.5వేలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రూ.5వేల చొప్పున వరద బాధితులకు కోసం సీఎం సహాయనిధికి పంపినట్టు రేసింగ్‌బాయ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

పింఛన్ రావడం లేదని నిలదీత

ఎడపల్లి, సెప్టెంబర్ 11: వివరాల నమోదులో తప్పిదం వల్ల ఓ లబ్ధిదారురాలికి పింఛన్ ఆగిపోయింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పోచారం గ్రామానికి చెందిన వృద్ధాప్య పింఛన్‌దారుడు తాడెం గంగారాం గత సంవత్సరం అక్టోబరులో మరణించాడు. దీంతో అతని భార్య తాడెం సాయమ్మ తన భర్త మరణించినందున వృద్ధాప్య పింఛన్‌ను, వితంతు పింఛన్‌గా మార్చి తనకు ఇవ్వాలని ఫిబ్రవరి నెలలో ఎడపల్లి మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకుని ఎనిమిది నెలలు కావస్తున్నా ఆమెకు పింఛన్ అందలేదు. దీంతో ఆమె కుమారుడు తాడెం ఇస్తారీ మండల కార్యాలయానికి వచ్చి మండల అభివృద్ధి అధికారిని పదినెలలుగా ఎందుకు రావడం లేదని నిలదీశాడు. దీంతో ఎంపీడీవో శంకర్ కార్యాలయంలోని కంప్యూటర్ ఆపరేటర్‌ను పిలిపించి విచారించాడు. కాగా అధికారుల తప్పిదం వల్లే తన తల్లికి పింఛన్ రాలేదని, ఇలాంటివి మరలా పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన రుద్రూరు నాయకులు

రుద్రూరు, సెప్టెంబరు 11 : రుద్రూరు మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బుధవారం హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ బాలరాజ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి అభినందనలు తెలిపారు. అదేవిధంగా నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణా రావును కలిసి సన్మానించారు. కలిసిన వారిలో రుద్రూరు మండల అధ్య క్షులు తోట అరుణ్‌కుమార్, ఉపాధ్యక్షులు నడిపింటి నగేష్, మండల నాయకులు మాశెట్టి శ్రీను, కొండలవాడి శంకర్ తదితరులున్నారు.

కేరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబర్ 11: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయనశాస్త్ర విభాగం, కేరీర్ గైడెన్స్ సెల్ సహ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు కేరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వై.వేణుప్రసాద్, తెలంగాణ యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ చైర్‌పర్సన్ జి.బాలకృష్ణలు మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాన్ని నిర్దేశించుకొని చక్కని ప్రణాళిక, పట్టుదలతో ముందుకు వెళ్తే లక్ష్యం సాధించడం సులభమవుతుందని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.సునీత, డాక్టర్ జి.లింగన్న, జాన్ సుకుమార్, అంబార్‌సింగ్, శ్యామ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న చైర్‌పర్సన్

నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలి

● సబ్‌కలెక్టర్ వికాస్ మహతో

బోధన్‌రూరల్, సెప్టెంబర్ 11: వినాయక నిమజ్జనాన్ని ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలనిబోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని వినాయక నిమజ్జన రూట్‌మ్యాప్‌ను బోధన్ ఏసీపీ, మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మశరత్ రెడ్డితో కలిసి పరిశీలించారు. రాకాసిపేటలోని రైల్వేగేట్ సమీపంలోని జూనియర్ కళాశాల మైదానంలో ఉన్న గణేష్‌ల బావిని పరిశీలించారు. అనంతరం పసుపు వాగులో నిమజ్జన ప్రదేశాన్ని సైతం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ పండుగ అనంతరం నిమజ్జనానికి చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గణేష్ నిమజ్జనం కోసం అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలన్నారు. సంబంధిత అధికారులు సెలవులు పెట్టకుండా అందుబాటులో ఉండాలన్నారు. ప్రజలు గణేష్ నిమజ్జన శోభాయాత్రను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు.



బావిని పరిశీలిస్తున్న దృశ్యం

తొమ్మిది రోజుల పాటు రాకాసిపేటలో పూజలు నిర్వహిస్తున్న గణనాథులను ఆదివారం పసుపువాగులో నిమజ్జనం చేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు. అలాగే శక్కర్‌నగర్‌లోని వినాయకులను తొమ్మిది రోజుల పాటు పూజించి శక్కర్‌నగర్‌లోని గణేష్ బావిలో నిమజ్జనం చేస్తారన్నారు. ప్రజలు గణేష్ నిమజ్జన శోభాయాత్రను సమన్వయంతో ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, తహసీల్దార్ విఠల్, పట్టణ సీఐ వెంకటనారాయణ, రూరల్ సీఐ కోలా నరేష్, మున్సిపల్ ఏఈ శ్రీనివాస్, అధికారులు తదితరులున్నారు.

ముప్కాల్ : బాల్కొండ మండల కేంద్రంలో పెద్దచెరువులో గణేష్ నిమజ్జనోత్సవం ఏర్పాట్లను బుధవారం ఎస్సై బి.నరేష్, పంచాయతీకార్యదర్శి రజనీకాంత్‌రెడ్డి, విద్యుత్ అధికారులతో కలిసి సీఐ శ్రీధర్ పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీధర్ మాట్లాడుతూ రోడ్లకు ఇరువైపుల అడ్డంగా ఉన్న చెట్లకొమ్మలను తొలగించి తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ వైరు తీగలను బిగించాలని సూచించారు.

మాక్లూర్ : మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు బుధవారం మండలంలోని బోర్గం(కె) గ్రామ చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను అధికారులు, నిర్వాహకులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో పొద్దుటూరి టవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమమహేశ్వర్‌రెడ్డి, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ ఈఈ, ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు చేపట్టాలి

● ఎంపీడీవో రాజా శ్రీనివాస్

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 11: వర్షాకాలంలో వ్యాపించే సీజనల్ వ్యాదులు ప్రబలకుండ ముందస్తు చర్యలు చేపట్టాలని కమ్మర్‌పల్లి ఎంపీడీవో రాజా శ్రీనివాస్ అన్నారు. బుధవారం కమ్మర్‌పల్లి మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని అయన సందర్శించి పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రి పరిధి గ్రామాల వివరాలను తెలుసుకుని సీజనల్ వ్యాదులు రాకుండా చేపడుతున్న చర్యలను స్థానిక ఆసుపత్రి వైద్యులు డాక్టర్ నర్సింహాచారిని అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో ఆరోగ్య ఉపకేంద్రాల ద్వారా అందిస్తున్న ఆరోగ్యసేవలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. అనంతరం కమ్మర్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి వర్షపు నీరు నిలువ ఉన్నందున నీరు ఆగకుండా చూసుకోవాలని ఆదేశిస్తూ నిలులవ నీటిపై బ్లీచింగ్, అయిల్ బాల్స్ వేయించారు. అనంతరం ఆసుపత్రి రికార్డులను ఆయన పరిశీలించారు. అక్కడున్న వైద్య సిబ్బందితో మాట్లాడుతు ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలందించాలని ఆదేశించారు. మందులస్టాక్‌ను ఆడిగి తెలుసుకున్నారు.

సాయుధ పోరాట చరిత్ర కమ్యూనిస్టులదే

కోటగిరి,సెప్టెంబర్ 11: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్ర కమ్యూనిస్టులదేనని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ పేర్కొన్నారు. కోటగిరి మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట 76వ వార్షికోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ నైజంపాలనకు వ్యతిరేకగా భూమి, భుక్తి, మాతృభూమి విముక్తి కోసం జరిగిన పోరాటంలో 4వేల మంది సీపీఐ కార్యకర్తలతో పాటు మరెందరో ప్రజలు ప్రాణాలు కోల్పోయ్యారన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య, నియోజకవర్గ ఇన్‌చార్జి రాములు, మండల కార్యదర్శి విఠల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్‌ల పంపిణీ

రెంజల్, సెప్టెంబర్ 11: మండలంలోని నీలా ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహించిన రజిత 2015లో రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆమె జ్ఞాపకార్థం భర్త విజయ్ ప్రతిసంవత్సరం విద్యార్థులకు నోట్‌బుక్, పెన్నులు, పలకలు పంపిణీ చేయడం జరుగుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్ అన్నారు. 2016 నుంచి ప్రతి సంవత్సరం విద్యార్థులకు నోట్‌బుక్‌లను అందించడం జరుగుతుందని వారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీరాం, ప్రవీణ్, జలేందర్ గౌడ్, లింగన్న, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యంలో ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు



ప్రశంసా పత్రాలు పొందిన విద్యార్థులు

ఏర్గట్ల, సెప్టెంబరు 11: పత్తిపాక ఫౌండేషన్ అలాగే గరిపెల్లి ట్రస్ట్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఎన్నుకోబడిన 30 పాఠశాలల్లో సాహిత్య కార్యశాలలో భాగంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు రాసిన కథలకు గాను ప్రశంసాపత్రాలను బుధవారం యాభై మంది విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు కృష్ణచారి అందజేశారు. కార్యక్రమంలో తెలుగ పండితలు ప్రవీణ్ శకర్మ, ఉపా ధ్యాయులు రాజశేఖర్, శ్రీనివాస్, పవన్, విజయ, విద్యార్థులు పాల్గొన్నారు.

భారత్ జట్టు సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు



విద్యార్థినులను సన్మానించిన కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకురాలు

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబర్ 11: ఏషియన్ యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ పోటీలకు తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు అజ్మీర ఇందు, లకావత్ రాణిలు భారత జట్టు తరఫున ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రిక తెలిపారు. తైవాన్ దేశంలో తైచుంగ్‌లో జరుగనున్న నాల్గో ఏషియన్ యూనివర్సిటీ ఉమెన్స్ సాఫ్ట్‌బాల్ ఏషియకప్ - 2024 పోటీలు అక్టోబర్ 15 నుంచి 19వ తేదీ వరకు జరుగనున్నాయని, పోటీలలో కళాశాలకు చెందిన విద్యార్థులు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రిక పట్టుశాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

సినీ ఫక్కీలో 1.96 లక్షల నగదు చోరీ

నవీపేట, సెప్టెంబర్ 11: మండలంలోని జన్నేపల్లిలో బుధవారం దెబ్బ చిన్న చిన్నయ్య అనే గొర్రెల కాపరికి చెందిన 1.96లక్షల రూపాయల నగదును గుర్తుతెలియని దుండగులు లాక్కెళ్లారు. ఎస్‌ఐ వినయ్ తెలిపిన తెలిపిన ప్రకారం... మాక్లూర్ మండలం అల్వాపూర్‌కు చెందిన చిన్న చిన్నయ్య తన భార్య గంగామణితో కలిసి జన్నేపల్లి కెనరా బ్యాంకుకు వచ్చారు. మధ్యాహ్నం 12గంటల సమయంలో బ్యాంకులో ఉన్న 1.96లక్షల నగదును డ్రా చేసుకుని ఒక కవర్‌లో పెట్టుకున్నారు. అదే కవర్‌లో పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డులు, బ్యాంకు ఖాతా బుక్కులను కూడా అందులో ఉంచారు. నగదు ఉన్న కవర్‌ను గంగామణి చేతిలో పట్టుకుని బైక్ వెనుక కూర్చొగా చిన్న చిన్నయ్య బైక్ నడుపుతూ తమ స్వగ్రామానికి బయల్దేరారు. బ్యాంకు దాటిన కొద్ది దూరం తర్వాత గుర్తు తెలియని దుండగుడు హెల్మెట్ పెట్టుకుని స్కూటి వాహనంతో బైక్‌ను వెంబడించి గంగామణి చేతిలో ఉన్న నగదు కవర్‌ను లాక్కెళ్లి పారిపోయాడు. దుండగుడి కోసం సమీపంలో గాలించినప్పటికీ నిందితుడు పరారీ అయ్యాడు. బాధితుడు దెబ్బ చిన్న చిన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్ల చోరీ

బోధన్‌రూరల్, సెప్టెంబర్ 11: బోధన్ మండలంలోని సాలూర, పెంటాఖుర్దు గ్రామాల్లోని పంట పొలాల్లో రెండు ట్రాన్స్‌ఫార్మర్ల కాపర్‌వైర్‌లను గుర్తు తెలియని దుండగులు దొంగిలించినట్లు రూరల్ ఎస్‌ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. పంట పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్‌లను చోరీ చేయడం జరిగిందని, ఆయా పంట పొలాల రైతులు, ట్రాన్స్‌కో ఏఈ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామన్నారు. సీసీ పుటేజీ అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టి దొంగలను పట్టుకుంటామన్నారు.

పాము కాటుకు వ్యక్తి మృతి

ఎడపల్లి, సెప్టెంబర్ 11: ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన వ్యక్తి పాముకాటుకు గురై మరణించినట్లు స్థానికులు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన దువ్వ నారాయణ (61) అనే వ్యక్తి పాముకాటుకు గురి కావడంతో గమనించిన స్థానికులు వెంటనే నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపినట్లు స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు11: విద్యార్థులు క్రీడల్లో నైపుణ్యం ప్రదర్శించి పట్టుదలతో ఆడి రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించాలని ఆలూర్ సొసైటీ చైర్మన్ తంబురి శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆర్మూర్ మండలం ఇస్సాపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల మండల స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేసి మెమోంటోలను అందజేసి సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రాజగంగారాం, స్థానిక నాయకులు డీసీ.ముత్తెన్న, ఉపాధ్యాయులు జగదీష్, శ్రీనివాస్, కృష్ణరెడ్డి, చిన్నయ్య, లింబాద్రి, రాము, అర్పిత, అరుంధతిలు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న సొసైటీ చైర్మన్ తంబురి శ్రీనివాస్

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

● పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు

నవీపేట, సెప్టెంబర్ 11: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో విద్యాబోధన చేయడం జరుగుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి సముచిత ప్రాధాన్యత ఇవ్వడం పట్ల ఆయన కృతజ్ఞత తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తూ మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 30 మందికి పూలమాలలు, శాలువా, మెమోంటోలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈవో గణేష్ రావు, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు భూమయ్య, శివకుమార్, హన్మారెడ్డి, జేదీద్య, గోవర్ధన్, మహిళాళళళళళల ఉపాధ్యాయ సంఘం అధ్యక్షురాలు రాధ, భూంరెడ్డి, గోపాల్‌రెడ్డి, వివిధ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్లూర్‌లో ఇంటి వేలం

కోటగిరి,సెప్టెంబర్ 11 : పొతంగల్ మండలంలోని కల్లూర్ గ్రామంలో కెనరా బ్యాంక్ సీఎస్‌పీ సెంటర్ నిర్వాహకురాలు సంధ్య ఇంటికి బుధవారం గ్రామస్థులు వేలం నిర్వహించారు. నెలరోజుల క్రితం గ్రామంలోని మహిళ సంఘాల డబ్బులు సుమారు 45లక్షలు సీఎస్‌పీ నిర్వాహకురాలు కాజేసింది. దీంతో మహిళ సంఘాల సభ్యులు, గ్రామస్థులు ఆందోళనకు దిగి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. నెల రోజులు గడువు ఇచ్చిన డబ్బులు చెల్లించడంలో సీఎస్‌పీ సెంటర్ నిర్వాహకురాలు నిర్లక్ష్యం చేయడంతో మహిళ సంఘాల సభ్యులు ఇంటికి వెళ్లి నిలదీశారు. ఇంటిని గ్రామస్థుల సమక్షంలో వేలం వేయించారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సుమారు15లక్షల రూపాయలకు వేలంలో ఇంటివని దక్కించుకున్నారు. నెల రోజుల్లోగా 15లక్షల రూపాయలు చెల్లిస్తానని వేలంలో ఇంటిని దక్కించుకున్న వ్యక్తి స్పష్టం చేశాడు. ఇప్పటికే సీఎస్‌పీ సెంటర్ నిర్వాహకురాలు 6లక్షల రూపాయలు జమ చేసింది. ఇంటికి వేలం నిర్వహించడంతో మరో 15లక్షల రూపాయలు రికవరీ అవుతుందని మహిళ సంఘాల సభ్యులు భావిస్తున్నారు. మరో 23 లక్షలు చెల్లించి సమస్యను పరిష్కరించాలని మహిళలు కోరుతున్నారు.



సీఎస్‌పీ సెంటర్ నిర్వాహకురాలిని నిలదీస్తున్న దృశ్యం

వినాయకుడికి పూజలు నిర్వహించిన టీయూ రిజిస్ట్రార్



టీయూ హాస్టల్ లో పూజలు చేస్తున్న రిజిస్ట్రార్ యాదగిరి

డిచ్‌పల్లి, సెప్టెంబరు 11 తెలంగాణ వర్సిటీ ఓల్డ్ హాస్టల్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహానికి టీయూ రిజిస్ట్రార్ యాదగిరి బుధవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆడిట్ సెల్‌డైరెక్టర్ ఘంట చంద్రశేఖర్, చీఫ్ వార్డెన్ మహేందర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలని తహసీల్దార్‌కు వినతి

భీమ్‌గల్, సెప్టెంబరు 11 : ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలను కబ్జాల నుంచి కాపాడాలని బుధవారం భీమ్‌గల్ మండలం కుప్కాల్ గ్రామానికి చెందిన దేవ్‌సింగ్ తహసీల్దార్ మహమ్మద్ షబ్బీర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ భూములు, చెరువులు, గుంటలు ఇందిరమ్మ ప్లాట్లను కొందరు కబ్జాలు చేస్తున్నారని, వాటిని వెంటనే అరికట్టాలని తహసీల్దార్‌ను కోరారు. హైదరాబాద్‌లో చేపడు తున్న హైడ్రా మాదిరి భీమ్‌గల్ మండలంలో కూడా చేపట్టి మొదట కుప్కల్ నుంచి ప్రారంభించాలని ఆయన తహసీల్దార్‌ను కోరారు.

బాధితులకు ఆర్థిక సహాయం

మోర్తాడ్, సెప్టెంబరు 11: మండలంలోని దొన్కల్ గ్రామానికి దర్మగాండ్ల సాయి భార్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడు తున్నారు. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులకు ముత్యాల సునీల్‌కుమార్ రూ.5000 ఆర్థిక సహాయం పంపించారు. బుధవారం మండలంలోని దొన్కల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం అనిల్ రూ.5వేలను కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సం దర్భం గా సునీల్‌కుమార్‌కు బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలి పా రు. కార్యక్రమంలో గడ్డం అనిల్, అరుణ్, మల్లికార్జున్, ముత్యం, కల్లెం రవి, చింతకింది రవి, తుమ్మల వినోద్, బాస మహేందర్, శ్యామ్, బంజార శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన మానాల

మోర్తాడ్. సెప్టెంబరు 11: మండలంలోని ధర్మోరా గ్రామాన్ని బాధిత కుటుంబాలను బుధవారం రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి పరామర్శించారు. గ్రామానికి చెందిన ముస్కు భూమారెడ్డి, మరణించడంతో ఆయన కుమారులు రాజేందర్ రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు. అంతేగాక మోర్తాడ్‌లో ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు నీరజ్ తండ్రి అనారోగ్యంతో ఉండడంతో వారి ఇంటికి వెళ్ళి ఆరోగ్య విషయాలను అడిగితెలుసుకున్నారు. ఆయన వెంట మాజీఎంపీపీ గిర్మాజీ గంగాధర్, మాజీఉపసర్పంచ్ సొక్కా యి గంగారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పుప్పాల అశోక్, మహి పాల్, గిర్మాజీ గోపి, భూమారెడ్డి, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలో రిటైర్డు ఉపాధ్యాయుడు రాందాస్ కుటుంబసభ్యులను రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి పరామర్శించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు రాందాస్, ఇటీవల మృతిచెందడంతో ఆయన కుమారుడు సీఐ రాజశేఖర్‌ను మానాల మోహన్‌రెడ్డి పరామర్శించారు.

కమ్మర్‌పల్లి: మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్తలు ఆర్‌ఎంపీ వైద్యుడు జనార్ధన్, ఇప్ప గంగాధర్‌లు ఇటీవల అనారోగ్యంతో మరణించగా బుధవారం స్వగ్రామం నర్సాపూర్‌లో వారి కుటుంబసభ్యులను జిల్లా కాంగ్రెస్ అధ్య క్షుడు మానాల మోహన్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట మండలపార్టీ అధ్యక్షుడు సుంకెట రవి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వెంకటి గణేష్ సంజీవ్ యాదవ్, రాకేష్, లింబాద్రి, శేఖర్, రవీందర్ ఉన్నారు.

'ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలి'

బోధన్‌రూరల్, సెప్టెంబర్ 11: ఆర్టీసీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ రీజినల్ ఇన్‌చార్జి కాశీరాం అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని పాత బస్టాండ్‌లో ఆర్టీసీ ఆధ్వర్యంలో లాజిస్టిక్ కార్గో సర్వీస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, మహారాష్ట్రలతో సహ ఇతర రాష్ట్రాల నుంచి బస్సులలో వేగంగా, సురక్షితంగా వస్తువులను డెలివరీ చేయడానికి ఈ సేవ ప్రారంభించబడిందన్నారు. ప్రజలకు అవసరమైన వస్తువులను సులభంగా ఇతర ప్రాంతాలకు, రాష్ట్రాలకు పంపవచ్చన్నారు. ఆర్టీసీ అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ కార్గో డీఎం పాల్, కార్గో ఇన్‌చార్జిలు సాహిద్, ఇర్ఫాన్, కౌన్సిలర్ జావీద్ పాల్గొన్నారు.

'గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి'

బోధన్‌రూరల్, సెప్టెంబర్ 11: గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని అప్పుడు తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా మహిళ సాధికారత కో-ఆర్డినేటర్ స్వప్న అన్నారు. బుధవారం సాలూర మండలంలోని హున్స గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీలకు పౌష్టికాహారం అందించడానికి ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంగావేణి, జడ్పీహెచ్‌ఎస్ హెడ్‌మాస్టర్ రమా, ఏఎన్‌ఎం గంగామణి, అంగన్‌వాడీ టీచర్లు లావణ్య, రాధ, కమల పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాపై విద్యార్థులకు అవగాహన

బోధన్‌రూరల్, సెప్టెంబర్ 11 : విద్యుత్ సరఫరాపై విద్యార్థులు అవగాహన కలిగిఉండాలని ఉపాధ్యాయురాలు శాంతి అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఐటీ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీపై ఉపాధ్యాయురాలు విద్యార్థిని, విద్యార్థులకు పట్టణ శివారులోని బెల్లాల్ విద్యుత్ ఉత్పత్తి సబ్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విద్యుత్ ఉత్పత్తిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యుత్ సరఫరా తదితర అంశాలపై ట్రాన్స్‌కో అధికారులు, విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు విద్యతో పాటు విద్యుత్‌పై కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు.

పెర్కిట్ : అగ్ని, విద్యుత్ ప్రమాదాలను నివారించి వాటి నుంచి ఎలా కాపాడుకోవాలో అగ్నిమాపక అధికారి మధుసూ దన్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు మెళకువలు తెలిపారు. బుధవారం ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో నలంద పాఠశాలలో అగ్నిమాపక సిబ్బంది విద్యార్థులకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిం చారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం ప్రసాద్, సాగర్, అధ్యా పక బృందం పాల్గొన్నారు.

ముప్కాల్‌లో జల సర్వే

ముప్కాల్, సెప్టెంబర్ 11: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వాతావరణంలో మార్పుల వల్ల సీజనల్ వ్యాధుల నివారణ కోసం ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం ముప్కాల్ మండల కేంద్రంలో ఇంటింటికి తిరుగుతూ జలసర్వే నిర్వహించారు. మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, వైరల్ ఫీవర్ అరికట్టడానికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశవర్కర్‌లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంతర్ పాఠశాల క్రీడా పోటీలు

ముప్కాల్, సెప్టెంబర్ 11: బాల్కొండ మండల కేంద్రంలో రెండో రోజు ఉమ్మడి బాల్కొండ మండలాల అంతర్ పాఠశాల క్రీడలు కొనసాగుతున్నాయి. బుధవారం ముప్కాల్, బాల్కొండ, మెండోర మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు అండర్-14 కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటాపోటీగా క్రీడాకారులు తలపడుతున్నారు. గురువారం ఫైనల్ పోటీలు జరుగుతాయని పీడీ రాజ్‌కుమార్ తెలిపారు.

యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు ప్రకటించడంపై హర్షం

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబర్ 11: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోఠి మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు పెడు తున్నట్టు ప్రకటించడంపై రజక ఐక్య వేదిక జిల్లా యువజన అధ్యక్షుడు మీరశ్రావణ్ హర్షం వ్యక్తం చేశారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఐలమ్మ వీరత్వాన్ని, ధైర్యాన్ని గుర్తు చేసుకుంటూ ప్రతీ మహిళ ధైర్యంతో పోరాడాలని స్ఫూర్తి దాయకంగా ఉండాలని తెలుపుతూ యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు ప్రకటించడంపై సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

జిల్లాలో గణేష్ మండపాల వద్ద అన్నదానాలు

బాన్సువాడ, సెప్టెంబరు 11: మండలంలోని హనుమాజీపేట గ్రామంలో నవ భారత్ యూత్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో గణేష్ మండపం వద్ద బుధవారం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాన్సువాడ ఎస్‌హెచ్‌వో మున్నూరు కృష్ణ విచ్చేసి మహా అన్నదాన కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. నవ భారత్ యూత్ గణేష్ మండపం సభ్యులు సీఐ కృష్ణను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నవ భారత్ యూత్ సభ్యులు గైని శ్రీనివాస్, పోతరాజు గంగరాజు, కుంట సుధాకర్, అజ్జిగా భాస్కర్, బెగారి శివ, కొంకి రాజు, కాశీ, రామాగౌడ్, మంద సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉమ్మడి మద్నూర్ మండలంలోని ఆయా గ్రామాల్లో సుమారు 500 విగ్రహాల ప్రతిష్ఠాపన నిర్వహించారు. రోజుకో గణేష్ మండపం వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బుధవారం మండల కేంద్రంలోని కుమార్ గణేష్ మండలి వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నదాన కార్యక్రమాలతో పాటు భజన, కోలాటాలు, బుర్ర కథలు తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మద్నూర్‌లోని కుమార్ గణేష్ మండపం వద్ద నిర్వహించినర అన్నదాన కార్యక్రమంలో బిచ్కుంద సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నరేష్ పాల్గొని గణేష్ మండపాల సభ్యులతో మాట్లాడారు. వినాయక మండపాల వద్ద భక్తి పాటలు పెట్టుకోవాలని అశ్లీలమైన వాటికి దూరంగా ఉండాలని వారికి సూచించారు. మండల గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సీఐ నరేష్‌కు శాలువాతో కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సాయి పటేల్, సాయిలు, రఘు, రవి తదితరులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్: మండలంలోని మైలారం గ్రామంలో బుధవారం ఆదిదేవ్ గణేష్ మండలి ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గణేష్ మండలి సభ్యులు మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా గ్రామంలోని గణేష్ మండపం వద్ద గణేష్ మండలి సభ్యుల ఆధ్వర్యంలో ప్రతియేడు అన్నదాన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ అన్నదాన కార్యక్రమంలో కమిటీ సభ్యులు పెర్క రాజు, మిన్ను,సాయిరాం యాదవ్, కాశీ, లక్కీ యాదవ్, వెంకన్న, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ: మండల కేంద్రంలోని గల్లిక గణేష్, సీతారాంపూర్ అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు గణేష్ మండపాల్లో బుధవారం అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.ఉదయం నుంచే మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో చింతల రాజేష్, బాపురెడ్డి, విఠల్‌రెడ్డి, రాం కిషోర్, నత్తి రమేష్ , లింగాల లింగం, నత్తి కిష్టయ్య, సంజీవ్, గణేష్, రాజయ్య, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

మాచారెడ్డి: మండలంలోని గజ్యానాయక్ తండాలో బుధవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు విపుల్‌జైన్ మాట్లాడుతూ మండలంలోని ప్రతీ గ్రామంలో, తండాలో ఇంటింటికి వెళ్లి బీజేపీ సభ్యత్వం నమోదు కార్యక్రమం నిర్వహించి బూత్ స్థాయిలో బీజేపీ మద్దతు దారులను కలవాలని అన్నారు. సభ్యత్వ నమోదు కోసం 8800002024కి ఫోన్‌చేసి బీజేపీ సభ్యత్వం తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు పొన్నాల వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బుస్స సురేష్, నాయకులు నర్సింలు, అనిల్, నరేష్, లడ్డు, హన్మండ్లు, చలపతి, మదుసూదన్, శ్రీధర్,ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


బాన్సువాడలో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం


బిచ్కుందలో..


మైలారంలో..


దోమకొండలో..


తల్వార్ దాడిలో గాయాలపాలైన వ్యక్తి

బాన్సువాడలో తల్వార్ దాడి కలకలం

బాన్సువాడ టౌన్ / బాన్సువాడ: బాన్సువాడ పట్టణంలోని తాడ్కోల్ చౌరస్తా సమీపంలో గల మధురాలయ బార్ అండ్ రెస్టారెంట్ పరిసరాల్లో బుధవారం రాత్రి తల్వార్ దాడి కలకలం రేపింది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. మద్యం మత్తులో ఇద్దరు యువకుల మధ్య మాటమాట పెరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. సోను సింగ్ అనే యువకుడు తల్వార్‌తో ఆటో డ్రైవర్ సంజీవ్‌పై తల్వార్‌తో దాడి చేసినట్లు స్థానికులు పేర్కొన్నారు. కాగా ఈ దాడిలో సంజీవ్ తీవ్ర గాయాలపాలయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రున్ని బాన్సువాడ ఏరియాస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్సలు జరుపగా పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. సంఘటకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


బీర్కూర్‌లో వరద బాధితుల సహాయ నిధికి విరాళం అందజేస్తున్న దృశ్యం

వరద బాధితులకు ఆర్థిక సహాయం

బీర్కూర్, సెప్టెంబరు 11 : గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాల ధాటికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పలు ప్రాంతాలలో ప్రజలు వరదలతో తీవ్రంగా నష్టపోయారు. ఇదిలా ఉండగా వరద బాధితులను ఆదుకునేందు కోసం బీర్కూర్ వెంకటప్పయ్య క్యాంపునకు చెందిన కామినేని సుజాత, విజయ్ కుమార్ దత్తులు రూ.10 వేల ఆర్థిక సహాయం ప్రకటించారు. ఈ మేరకు 10 వేల విలువైన చెక్కును లయన్స్ సభ్యులకు అందజేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సహాయ నిధికి డబ్బులు పంపనున్నట్లు లయన్స్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గాలయ్య, కిషోర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

బీర్కూర్, సెప్టెంబరు 11: డ్వాక్రా మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలను అందిస్తున్నామని ఏపీఎం గంగాధర్ అన్నారు. రుణాలను పొందిన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. బుధవారం ఆయన బీర్కూర్ మండలం వీరాపూర్‌కు విచ్చేశారు. రుణాల కోసం డ్వాక్రా మహిళలు దరఖాస్తు చేసుకున్న పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరం మహిళలకు 22కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈనెలాఖరు వరకు 11 కోట్ల రుణ లక్ష్యం ఉండగా ఇప్పటి వరకు 9 కోట్ల రుణాలు మహిళలకు అందించామన్నారు. మిగిలిన రుణాలను నెలాఖరు వరకు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రుణాలు తీసుకున్న మహిళలు గేదెలు, కోళ్ల, కొనుగోలు చేసి వ్యాపారం చేసుకోవాలన్నారు. ఇది వరకు స్త్రీ నిధి రుణాలు పొంది, బకాయి పడిన మహిళలు వంద శాతం బకాయి మొత్తం చెల్లిస్తే వారికి కొత్త రుణాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సిబ్బంది మహిళలు ఉన్నారు.

డోంగ్లిలో పంటల పరిశీలన

మద్నూర్, సెప్టెంబరు 11: ఉమ్మడి మద్నూర్ మండలంలో జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్ బుధవారం క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. అనంతరం మద్నూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో రుణమాఫీలో భాగంగా రేషన్ కార్డు లేని వారికి కుటుంబ సభ్యుల నిర్ధారణ చేస్తున్న ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. త్వరగా ఫ్యామిలీ మ్యాపింగ్ చేయాలని, అర్హులు ఉండి రుణమాఫీ కాని రైతులు ఉంటే దరఖాస్తు తీసుకుని పోర్టల్‌లో నమోదు చేయాలని స్థానిక వ్యవసాయ అధికారి రాజును ఆదేశించారు. అలాగే మద్నూర్ స్టేట్ బ్యాంకులో రుణమాఫీ జరుగుతున్న ప్రక్రియను మేనేజర్‌ను అడిగి తెలుసుకున్నారు. రైతులకు రెన్యువల్, కొత్త లోన్స్ పెండింగ్ పెట్టకుండా సకాలంలో రైతులకు ఇవ్వాలని బ్యాంకు మేనేజర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజు, వ్యవసాయ విస్తీర్ణ అధికారి విశాల్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా భగలాముఖి పీఠంలో అష్టమి పూజ

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 11: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని బీడీ వర్కర్స్ కాలనీలో ఆర్టీసీ బస్ డిపో పక్కన ఉన్న భగలాముఖి పీఠంలో బుధవారం అమ్మవారి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని అష్టమి పూజ నిర్వహించారు. పీఠం నిర్వాహకులు క్రాంతి పటేల్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి వివిధ పళ్ల రసాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించి మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రాంతి పటేల్ మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో అమ్మవారని పూజిస్తే సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన భక్తులతో పాటు తెలంగాణలోని వివిధ జిల్లాలు, మండలాలకు చెందిన భక్తులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ గ్రామంలో పార్టీ సభ్యత్వ నమోదు చేయాలి


సభ్యత్వ నమోదులో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 11 : బీజేపీ పార్టీ సభ్యత్వాన్ని ప్రతీ గ్రామంలో నమోదు చేసి సభ్యత్వాన్ని పెంచాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణ తార అన్నారు. బుధవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ సభ్యత్వాన్ని పెంచి పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని, అదే విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను కూడా ప్రజలకు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బాణాల లక్ష్మారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ లింగారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్‌రావు, సభ్యత్వ నమోదు జిల్లా కన్వీనర్ శ్రీకాంత్, నాయకులు భూమాగౌడ్, విఠల్, మర్రి బాలకిషన్, రాజ్, మోహన్‌రెడ్డి, సతీష్, వీకే నరేష్ పాల్గొన్నారు.

దోమకొండ: మండల కేంద్రంలో బుధవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి ప్రారంభించారు. అనంతరం పలువురి సభ్యత్వాన్ని నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో బీజేపీ సభ్యత్వం చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్, విపుల్, రవీందర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు మద్దూరి భూపాల్‌రెడ్డి, బీజేవైఎం అధ్యక్షుడు కంది మనోజ్ కుమార్, తిప్పపురం రవి, అంజిరెడ్డి, సుజాత, అంజమ్మ, గాజులపల్లి విఠల్‌రెడ్డి, నర్సింలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎఫ్‌వో నిఖిత

అమరుల త్యాగాలు వెల కట్టలేనివి

• డీఎఫ్‌వో నిఖిత

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 11: అమరుల త్యాగాలు వెల కట్ట లేనివని డీఎఫ్‌వో నిఖిత అన్నారు. జాతీయ అటవీశాఖ అమరవీరుల దినోత్సవం సందర్భంగా బుధవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లాకు చెందిన అక్బరుద్దీన్, గంగయ్యలతో పాటు ఇటీవల గుత్తికోయల దాడిలో అమరుడైన శ్రీనివాస్‌రావు చిత్రపటం వద్ద నివాళ్లు అర్పించారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో నిఖిత మాట్లాడుతూ అమరుల త్యాగాలు వెల కట్టలేనివని అన్నారు. విధి నిర్వహణలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కోవాలని అన్నారు. అడవులను కాపాడడం మనందరి బాధ్యత అని అప్పుడే భావితరాలకు మంచి ఆరోగ్యాన్ని ఇచ్చిన వారమవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ అటవీశాఖ అధికారి రామకృష్ణ, రెంజ్ అధికారి రమేష్, ఓంకార్, వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

లింగంపేట, సెప్టెంబరు 11: లింగంపేట మండలం ఎక్కపల్లితండాకు చెందిన నేనావత్ సర్దార్(35) మృత దేహం లభ్యమైనట్లు ఎస్సై అరుణ్ కుమార్ తెలిపారు. గత నెల 31న సర్దార్ ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారని ఆయన తెలిపారు. అదృశ్యమైనట్లు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. బుధవారం సూర్నకుంట వద్ద పొలంలో గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు సమాచారం రావడంతో సర్దార్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి మృతదేహాన్ని చూసి సర్దార్ మృతదేహంగా గుర్తించారని ఆయన తెలిపారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉందని కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భిక్కనూరులో గణేష్ నిమజ్జన వేడుకలు

భిక్కనూరు, సెప్టెంబరు 11: మండల కేంద్రంతో పాటుగా మండలంలోని ఆయా గ్రామాల్లో గణేష్ నిమజ్జన కార్యక్రమం కొనసాగుతుంది. నూతన కార్యక్రమంలో భాగంగా బుధవారం సాయంత్రం ఆయా గ్రామాల్లోని గణేష్ విగ్రహాలను ప్రత్యేకంగా ముస్తాబు చేసిన ప్రత్యేక వాహనాలలో ఉరేగించి స్థానిక చెరువు,కుంటల్లో నిమజ్జనం చేశారు. భిక్కనూరు మండల కేంద్రంలోని సిద్దార్థ పాఠశాలలో ప్రతిష్ఠించిన గణేష్ నిమజ్జన కార్యక్రమంలో విద్యార్థులు సంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


రైతు పొలంబాటలో పాల్గొన్న విద్యుత్ అధికారులు

ఎల్లారెడ్డిలో రైతు పొలం బాటలో విద్యుత్ అధికారులు

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 11: రైతులకు విద్యుత్ సరఫరాలో ఉన్న సమస్యలను నేరుగా తెలుసుకోవడానికి ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ రైతు పొలం బాట కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎల్లారెడ్డి ఏడీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎల్లారెడ్డి శివారు వ్యవసాయ ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్లి రైతు పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల వద్దకు వెళ్లి వారి సమస్యలను నేరుగా తెలుసుకుంటున్నామని, అదే విధంగా రైతులకు కూడా విద్యుత్‌పరంగా ఏమైనా ఇబ్బందులు ఉంటే విద్యుత్ అధికారులకు తెలియజేయాలని రైతులు విద్యుత్ మరమ్మతులు చేయకూడదని, రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ సత్యనారాయణ, లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మెన్‌లు, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

పుల్కల్ సొసైటీలో రికార్డుల పరిశీలన

బిచ్కుంద, సెప్టెంబరు 11: మండలంలోని పుల్కల్ సొసైటీలో జమ, ఖర్చుల రికార్డులను సొసైటీల పర్యవేక్షణ అధికారి లక్ష్మీనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుల్కల్ సొసైటీ లావాదేవీలు జమ ఖర్చులతో లక్షల రూపాయలు అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో జిల్లా కో ఆపరేటివ్ అధికారుల ఆదేశాల ప్రకారం రికార్డులు తనిఖీ చేపట్టడం జరిగిందని అన్నారు. పుల్కల్ సొసైటిలో వచ్చిన ఆరోపణలలో వాస్తవం లేదని జమఖర్చుల రికార్డులన్ని సక్రమంగానే ఉన్నాయని, ఫర్టిలైజర్ అమ్మకాలలో కూడా ఎలాంటి పొరపాట్లు జరగలేదని వివరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ రామకృష్ణరెడ్డి, సొసైటీ కార్యదర్శి సాయిప్రకాష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన సింధం పూజ

సదాశివనగర్, సెప్టెంబరు 11: మండలంలోని మర్కల్ ఉన్నత పాఠశాలకు చెందిన సింధం పూజ రాష్ట్రస్థాయి కోకో పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు కిరణ్‌ప్రసాద్ తెలిపారు. ఈనెల 13న హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి కోకో పోటీల్లో సింధం పూజ పాల్గొన్నట్లు ఆయన వివరించారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

సదాశివనగర్, సెప్టెంబరు 11: పాఠశాల ఉపాధ్యాయులు సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని జడ్పీ సీఈవో మండల ప్రత్యేకాధికారి చందర్‌నాయక్ అన్నారు. మండలంలోని ఉత్తనూర్‌లో అంగన్‌వాడికేంద్రం, ప్రభుత్వ పాఠశాల, పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం అందించాలని సూచించారు.

అంగన్‌వాడీ పాఠశాల తనిఖీ చేసిన ఎంపీడీవో

పెద్ద కొడప్‌గల్, సెప్టెంబరు 11: జుక్కల్ మండలంలోని లొంగన్ గ్రామంలో గల అంగన్‌వాడీ పాఠశాలను బుధవారం ఎంపీడీవో శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కేంద్రంలో గల రికార్డులు పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు, బాలింతలకు నాణ్యతతో కూడిన ఆహారం అందించాలని అంగన్‌వాడీ కార్యకర్తను ఆదేశించారు. పిల్లలు విద్యాబోధన సక్రమంగా చేయాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో సౌకర్యాలు విషయంపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనురాధ, ప్రధానోపాధ్యాయురాలు ప్రవీణ, అంగన్‌వాడీ కార్యకర్త తదితరులు పాల్గొన్నారు.

వీడీసీ స్థలాన్ని ముడితే తీవ్ర పరిణామాలు

భిక్కనూరు,సెప్టెంబరు 11: భిక్కనూరు గ్రామాభివృద్ధికి చెందిన స్థలాన్ని ముడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని భిక్కనూరు పట్టణ కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. ఈమేరకు వారు మాట్లాడుతూ వీడీసీకి చెందిన భూమిని కబ్జా చేసేందుకు కొందరు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఇకపై ఇలాంటివి మానుకోవాలని లేకపోతే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు విండో చైర్మన్ భూమయ్య, లింబాద్రి, దయాకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, దాబాసురేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు పీహెచ్‌సీలో కంటి పరీక్షలు

భిక్కనూరు, సెప్టెంబరు 11: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో బుధవారం కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి వైద్యుడు రవీందర్ వైద్యశిబిరానికి వచ్చిన 35 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీలో ప్రతీ బుధవారం కంటి వైద్య శిభిరం నిర్వహించడం జరుగుతుందని మండల ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీవో


గణేష్ నిమజ్జన స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో మన్నె ప్రభాకర్

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 11 : ఎల్లారెడ్డి పట్టణ కేంద్రం ఆవరణలో ఉన్న పెద్ద చెరువు వద్ద గణేష్ నిమజ్జనం ఏర్పాట్లు ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జనం ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ డీఈ వెంకటేశ్వర్లు, డీఎస్పీ శ్రీనివాసులు, తహసీల్దార్ మహేందర్, విద్యుత్ డీఈ విజయ్ సారథి, సీఐ రవీందర్ నాయక్, ఎస్సై మహేష్, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో రైతు మృతి

గాంధారి, సెప్టెంబరు 11: గాంధారి మండలంలోని గుర్జాల్ గ్రామానికి చెందిన అమర్లబండ దేవేంద్ర రావు అలియాస్ రాజు(35) బుధవారం విద్యుత్‌షాక్‌తో మృతి చెందినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. రాజు తన సొంత పొలంలో పత్తిపంటకు పురుగు మందు కొడదామని వెళ్లగా అక్కడ ట్రాన్స్‌ఫార్మర్‌కు వైరు ఊడిపోవడంతో కట్టెతో సరి చేసేందుకు ప్రయత్నించగా ప్రమాదవశాత్తు చేతులకు కరెంట్‌షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. పక్క పొలాల్లో ఉన్న రైతులు గమనించి వెంటనే వచ్చి చూసేసరికి అప్పటికే మృతి చెంది ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

అక్రమంగా చెట్లను నరికిన వారిపై కేసు నమోదు

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 11: మండలంలోని రత్నగిరిపల్లి బీట్‌లో అక్రమంగా చెట్లను నరికిన వారిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ అనిల్ తెలిపారు. మంగళవారం ఫారెస్ట్ బీట్ అధికారి మాచబోయిన మహేశ్వరి తమ విధుల్లో భాగంగా బీట్‌లో తిరుగుతుండగా కంపార్ట్‌మెంట్ నంబర్ 547 రత్నగిరిపల్లి బీట్‌లో మైసమ్మచెరువు తండాకు చెందిన 12 మంది చెట్లను నరకడంతో వారిపై ఫిర్యాదుచేసిందని తెలిపారు. కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

4,795 జీవాలకు పరుడు వ్యాధి నివారణ టీకాలు

దోమకొండ, సెప్టెంబరు 11: మండల కేంద్రంలో బుధవారం 4795 జీవాలకు పరుడు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి శివ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి డీఈ శ్రీనివాస్ హజరైనట్లు తెలిపారు.గొర్రెలు,మేకలకు ఉచితంగా పశుసంవర్ధక శాఖ నుంచి వచ్చిన టీకాలను ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రమేష్, రైతులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి
శాంతి - సరిపోదా శనివారం
దర్శన్ - ది గ్రేడెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్
ప్రియా 35 - 35 (2024)

బాన్సువాడ
మహేశ్వరి - సరిపోదా శనివారం
వెంకటేశ్వర - ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	120	150	180
వెన్‌కాబ్(కిలో)	130	160	190

